సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

డంపింగ్ యార్డుల్లా రహదారులు

- రోడ్ల వెంబడి ఇష్టారాజ్యంగా డెబ్రిస్ డంపింగ్
- ఇబ్బంది పడుతున్న స్థానికులు



కంచరపాలెం మలుపు వద్ద భవన నిర్మాణ వ్యర్థాలు



తాటిచెట్లపాలెం వీవీపీ రోడ్డు నుంచి ధర్మానగర్‌కు వెళ్లే మార్గంలో డంప్‌చేసిన డెబ్రిస్

కంచరపాలెం: స్థానిక ప్రధాన రహదారులు డంపింగ్ యార్డుల్లా దర్శనమిస్తున్నాయి. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రోడ్ల దుస్థితి ఘోరంగా మారింది. ఈ మార్గానికి ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. వాటి పైనే పశువుల కలేబరాలను వేస్తున్నారు. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రహదారులు, రైల్వే హెల్త్ సెంటర్, బీఎస్‌టీఎస్‌వస్ కాలనీ రోడ్లు డెబ్రిస్‌తో నిండి ఉండటంతో తిక్కవానిపాలెం, ధర్మానగర్ ప్రాంతాల ప్రజలు, ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోగులు ఇబ్బంది పడుతున్నారు. జంతువుల కలేబరాలతో ఆయా ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆయా మార్గాల్లో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు.

ప్రమాదాలకు నిలయం..

నెలలు గడుస్తున్నా.. డెబ్రిస్‌ను తొలగించకపోవడంతో రహదారులు ప్రమాదభరితంగా మారుతున్నాయి. వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చీకటి పడితే వీధిలైట్లు వెలగపోవడంతో నిత్యం పాదచారులు, వాహనదారులు చీకట్లోనే ప్రయాణం సాగిస్తున్నారు. కంచరపాలెం-తాటిచెట్లపాలెం రహదారికి ఇరువైపులా నిత్యం భారీ వాహనాలు పార్క్‌చేసి ఉంచడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్ల వెంబడి భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపై డెబ్రిస్ వేస్తే చర్యలు



ఇంటి నిర్మాణ వ్యర్థాలను రహదారులపై వేస్తే చర్యలు చేపట్టి వాటి డంపింగ్‌కు వినియోగించిన వాహనాలను సీజ్ చేస్తాం. ఆయా ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలపై సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ కార్యదర్శులు పర్యవేక్షించేటట్లు ఆదేశిస్తాం. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే మార్గం డెబ్రిస్‌ను గుర్తించాం. వాటిని తొలగించేందుకు చర్యలు చేపడతాం. – **ఆర్.జి.వి.కృష్ణ, జోన్–5 కమిషనర్, జీవీఎంసీ**

సినిమా షూటింగ్ సందడి

గోపాలపట్నం రైతుబజార్‌లో పరిచయ సన్నివేశాల చిత్రీకరణ



గోపాలపట్నం రైతుబజార్‌లో హీరోయిన్ అయేషాపై సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజార్‌లో గురువారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. ఉదయం 8.30 గంటలకు మొదలైన షూటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. హీరోగా సీనియర్ నటుడు బ్రహ్మాజీ కొడుకు సంజయ్ రావు(ఓ పిట్ట కథ ఫేమ్), హీరోయిన్‌గా ముంబైకి చెందిన అయేషాల మధ్య పరిచయ సన్నివేశాలను చిత్రీకరించారు. రైతుబజార్‌లో హీరోయిన్ కూరగాయలు కొనడం.. హీరో కోసం వెతుకుతుండటం వంటి సన్నివేశాలను షూట్ చేశారు. ఈ షూటింగ్‌ను చూసేందుకు వినియోగదారులు, రైతులు ఎగబడ్డారు. కొంత మంది బజారు చేయకుండా ఖాళీ సంచులతో అక్కడే నిలబడి ఆసక్తిగా తిలకించారు. డాన్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ బ్యానర్‌పై నిర్మాత లివింగ్‌స్టన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు మణిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాంబశివరావు



మంత్రి రాజశేఖర్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న సాంబశివరావు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు టి.సాంబశివరావు రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితుడయ్యారు. ఈ మేరకు గురువారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆయన అందుకున్నారు.

ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్‌లో తను చేసిన సేవలను గుర్తించి ఆల్ ఇండియా ఇంటక్ అధ్యక్షుడు జి.సంజీవ్‌రెడ్డి ఈ పదవిని ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన జిల్లా ఇంటక్ అధ్యక్ష, కార్యదర్శులు మంత్రి రాజశేఖర్, భోగవల్లి నాగభూషణంకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

షిర్డీసాయి మందిర పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో షిర్డీసాయిబాబా మందిర పునర్నిర్మాణ పనులకు గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, లక్ష్మి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్న పోలిమేర ఆదినారాయణ దంపతులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఆర్కే పురంలో స్థానిక భవానీ భక్తులు ఏర్పాటు చేసిన దుర్గాదేవి పీఠం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ కొణతాల సుధ అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం భక్తులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆమె ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ యువతలో దైవ భక్తితోపాటు సామాజిక సేవ చేసేలా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారికి పూజలు చేస్తున్న 97వ వార్డు కార్పొరేటర్ వసంత దంపతులు

సింహాచలం: చినముషిడివాడలోని గాంధీనగర్‌లో ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ ప్రతిష్టా మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, కలశ ప్రతిష్ట కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. 97వ వార్డు కార్పరేటర్ శానాపతి వసంత, శానాపతి శంకరరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

సక్రమంగా చెత్త సేకరణ

జగదాంబ: చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎల్ఎస్ శాస్త్రి అన్నారు. గురువారం సూర్యాబాగ్ జోన్-4 కార్యాలయంలో పారిశుధ్యం సిబ్బంది, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణలో తడి, పొడి ప్రమాదకర చెత్తను వేరు చేసి తీసుకోవాలన్నారు. క్లాప్ వాహనాలు కచ్చితంగా ఇంటింటికీ వెళ్లాలన్నారు. వాహనాలు వెళ్లలేని ప్రాంతాల్లో ఇళ్ల సమీపంలో వాహనాలు నిలిపి పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరించాలన్నారు. అదే విధంగా యూజర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. సెక్రటరీల పర్యవేక్షణ తప్పనిసరి అని తెలిపారు. రికార్డులు నమోదు చేసుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ఏఎంహెచ్‌వో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు గాంధీజీ వీధిలోని సచివాలయాన్ని(344) గురువారం కార్పొరేటర్ కొణతాల సుధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. సచివాలయం పరిధిలో అర్హులైన వారికి ఏయే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి, వాటి కోసం ఎవరెవరు దరఖాస్తులు చేసుకున్నారు, ఎన్ని దరఖాస్తులను తిరస్కరించారు, అర్హత ఉన్నా.. పథకాలు అందని వారి జాబితాను ఆమె పరిశీలించారు. రోజుకు ఎన్ని దరఖాస్తులు సచివాలయానికి వస్తున్నాయి, ఎక్కువగా ఏ సమస్యలపై ఫిర్యాదుదారులు వస్తున్నారు అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే ప్రజలతో గౌరవంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. వారితో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పైఅధికారులకు తమ తీరును వివరించాల్సి ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి సత్యనారాయణ, చట్టి నూకరాజు, సచివాలయం సెక్రటరీ సత్యనారాయణ, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా జువ్వాలమ్మ పండగ



అమ్మవారికి పూజలు చేస్తున్న బెహరా విజయచైతన్య

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం మూడు ఆలయాల వద్ద వెలసిన జువ్వాలమ్మ పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు. బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ బెహరా విజయచైతన్య అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

రైల్వే స్థలాల్లో ఆక్రమణల తొలగింపు



పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: నిత్యం రద్దీగా మారుతున్న కంచరపాలెం రోడ్డు, తాటిచెట్లపాలెం వీవీపీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం రైల్వే అధికారులు, జీవీఎంసీ సిబ్బంది రైల్వే స్థలాల్లో ఆక్రమణలను తొలగించారు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ వంతెన కూడలి నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రైల్వే రహదారికి ఇరువైపులా అక్రమ నిర్మాణాలను రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సారంజి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ లక్ష్మీనారాయణతో కలిసి చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ నేతృత్వంలో సిబ్బంది పొక్లెయిన్‌తో తొలగింపు చర్యలు చేపట్టారు. ఆ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రహదారులు మరింత విశాలంగా ఉండేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. రహదారిలో రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాలను ట్రాఫిక్ పోలీస్‌లు తరలించేందుకు కంచరపాలెం ట్రాఫిక్ అధికారులతో మాట్లాడామని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం రైతుబజార్‌ను సందర్శించిన ఏడీఎం



కూరగాయల విక్రయాలను పరిశీలిస్తున్న ఏడీఎం షేక్ యాసిన్

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజార్‌ను గురువారం ఏడీఎం షేక్ యాసిన్ సందర్శించారు. బజార్‌లోని స్టాళ్లు, కూరగాయల విక్రయ ధరలను పరిశీలించారు. డ్వాక్రా స్టాళ్లలో అనుమతులు పొందిన వారు ఉన్నారా లేదా అన్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతుబజార్ ఈవో డి.నారాయణరావు, సహాయకుడు కె.శివ వివరాలు తెలియజేశారు.

సింహగిరిపై వేడుకగా ఏకాదశి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



మదన గోపాలస్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం : ఏకాదశిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో విశేషంగా తిరువీధి నిర్వహించారు. మదన గోపాలస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో ఆశీనులను చేసి హారతులు అందజేశారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

- శాస్త్రోక్తంగా స్వర్ణ తులసీదళార్చన
- వైభవంగా నిత్య కల్యాణం



స్వర్ణ తులసీదళాలకు నమస్కరిస్తున్న సుధా గజపతిరాజు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేస్తున్న పండితులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఆశీనులను చేశారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త దివంగత పూసపాటి ఆనందగజపతిరాజు సతీమణి సుధా గజపతిరాజు ఈ పూజలో పాల్గొన్నారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ పూజ నిర్వహించారు.

ఘనంగా నిత్య కల్యాణం

ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30 గంటల వరకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ

ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై గురువారం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయ ఆస్థాన మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి సన్నిధిలో సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేషంగా పూజలు చేశారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం



ఐఎన్‌టీయూసీలో చేరిన నూతన కార్మికులతో సంఘ ప్రతినిధులు

సింధియా: కార్మికుల సమస్యలపై ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీరామమూర్తి అన్నారు. షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు పి.కె.వి.రమణ అధ్యక్షతన కార్మికుల సమక్షంలో గురువారం నెలవారీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్మికుల సమస్యలపై చర్చించిన సంఘ ప్రతినిధులు నూతనంగా యూనియన్‌లో చేరిన 9 మంది కార్మికులకు కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఉంటూ న్యాయం జరిగే వరకు ఐఎన్‌టీయూసీ శ్రమిస్తూనే ఉంటుందన్నారు. ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను పర్మినెంట్ చేసే విషయంలో ఐఎన్‌టీయూసీ చేస్తున్న ప్రయత్నాలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌తో ఎన్నికలపై అవగాహన



ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న హెచ్‌ఎం హెప్సిబా, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ఓటర్ల నమోదు, నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, ఓటింగ్ కౌంటింగ్, విజేతలను ప్రకటించడం వంటి ప్రక్రియలను విద్యార్థులకు అర్థమయ్యేలా ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్తేర్ హెప్సిబా ఆధ్వర్యంలో సోషల్ ఉపాధ్యాయిని కోమలి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియ విద్యార్థుల్లో మంచి అవగాహన కలిగిస్తుందని హెప్సిబా అన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా జీపీఏ పాలసీ



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న సొసైటీ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, పాలక మండలి సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ పాలక వర్గం జీపీఏ పాలసీ ద్వారా ఒక కుటుంబానికి అండగా నిలిచిందని సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.గోపాలకృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో బాధిత కుటుంబాలకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ సభ్యుడైన కె.రాజ్‌కుమార్ గతేడాది ఆగస్టు 28న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. సొసైటీ పాలకవర్గం ఏర్పాటు చేసిన జీపీఏ పాలసీ ద్వారా రూ.19 లక్షల చెక్కును ఆ కుటుంబానికి అందజేసినట్లు చెప్పారు. సభ్యుల అభ్యున్నతి కోసం ఎన్‌ఏడీ సివిల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ సొసైటీ పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌ఏడీ జంక్షన్‌లో దేవరాయల విగ్రహం ఏర్పాటుకు కృషి



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

బీచ్ రోడ్డు: శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాన్ని ఎన్ఏడీ జంక్షన్‌లో ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హామీ ఇచ్చారు. శ్రీకృష్ణ దేవరాయ కళా పీఠం ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణ దేవరాయల 552వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీచ్ రోడ్డులోని దేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కళలు, కళాకారులను పోషించి, ప్రోత్సహించిన మహనీయుడు కృష్ణదేవరాయలు అని కొనియాడారు. దేశ భాషలందు తెలుగు లెస్స అనే పలుకులతో చరిత్రలో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో కళా పీఠం అధ్యక్షుడు ఎన్.ఆర్.గంటా, ఎం.సురేష్ బాబు, ఉషాకిరణ్, చెన్నా తిరుమలరావు, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రేపు అన్నదానం

సింహాచలం: మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం జరిగే వేపగుంట వీరాంజనేయస్వామి ఆలయ తీర్థ మహోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో జరిగే ఈ అన్న సమారాధనకు భక్తులంతా తరలి రావాలని కోరారు.

మెగా పాటల పోటీలు రేపు

సీతంపేట: చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల18న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మెగా పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి జగదీష్, నూకల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. పాల్గొనదలచిన వారు 92479 48184 నంబర్‌లో సంప్రదించి పేరు, వివరాలు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

శిల్పారామంలో చేనేత వస్త్రాల మేళా ప్రారంభం

పీఎం పాలెం: చేనేత కళాకారులను ప్రోత్సహించి, వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి కోరారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేళాలో సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరు పొందిన చేనేత ఉత్పత్తులు ఈ స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు. స్టాల్స్ నిర్వాహకులు బి.సురేష్ మాట్లాడుతూ తక్కువ లాభాలు వేసుకుని చేనేత వస్త్రాలు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
✆ 9398184202, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
✆ 9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com